"ఇప్పుడైనా వుంటావా యింట్లో"

మాణిక్యంలో ఏం మార్పు రాలేదు. నాకంటె చిన్నదైనా. చిన్నప్పుడు నామీద అథారిటీతో మాట్లాడేది. ఇప్పుడూ అదే... నన్ను నొప్పించే అథార్టీ.

"విశ్వం ఎక్కడికి వెళ్ళాడన్నావ్?"

"బజారు కెళ్ళారు. పిల్లాడికి జోళ్ళు కొందామని"

"మా విశ్వం పూర్తిగా సంసారంలో మునిగిపొయ్యేడన్నమాట. ఇంకా అలాగే నవ్వుతూ కబుర్లు చెపుతున్నాడా?"

"నువ్వే చూసి చెప్పు" అంది మాణిక్యం.

"నువ్వేమైనా మార్పు వేమోనని" అన్నాను కొంచెం కామీగా ఫీలవుతూ.

"మగవాళ్ళు అంత సులభంగా మారతారుటోయ్," అంది మాణిక్యం వేదాంతినిలా.

ఇంతలో 'అమ్మో, అమ్మో' అంటూ మా పెళ్ళికుర్రాడు వచ్చాడు. నన్ను చూసి కళ్ళు చిట్లించి చూసి, వెక్కిరించాడు.

"మా రెండోవాడు" అంది మాణిక్యం వాడి తల నిమురుతూ.

"వాళ్ళ నాన్న చేష్ట లొచ్చినట్టున్నాయే" అన్నాను వేళాకోళంగా.

నా ముందు నాలుగైదు పత్రికలుంచి, రేడియో ట్యూన్ చేసి "చదువుతూ వుండు, ఇప్పుడే వస్తా" అని వంటింట్లోకి వెళ్ళింది మాణిక్యం.

రేడియోనించి సన్నగా సంగీతం వినపడుతోంది వంటింట్లోంచి పోపుఘాటు ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఇంతలో బయట బూట్ల చప్పుడైంది. గదిలోంచి పైకొచ్చాను. నన్ను చూసి విశ్వం "ఏవిటీ?" అంటూ కౌగిలించుకున్నంత పని చేశాడు. పక్కనున్న పిల్లాడు, ఆరేళ్ళవాడు. నన్ను దూరతనించి చూస్తున్నాడు.

నన్నాలాగే రెక్క పట్టుకొని గదిలోకి తీసికెళ్ళి కుర్చీలో కుదేసి "విశేషాలేవిట్రా?" అని పదిమార్లు అడిగాడు విశ్వం.

"ఏవున్నాయి..." అంటూనే నేను ఏదో చెపుతున్నాను.

"మణీ, మణీ, మా రాధ వచ్చాడు, చూశావా?" అన్నాడు విశ్వం వంటింట్లోకి చూస్తూ.

చేతులు రుమాలు తుడుచుకుంటూ మాణిక్యం వచ్చింది.

"మా శ్రీమతోయ్" అని నన్ను పరిచయం చేశాడు విశ్వం.

మాణిక్యం కొంటెగా నమస్కారం చేసి నవ్వుతోంది. ఆ నవ్వు అర్థంకాక తెల్లబోయాడు వాడు.

నేనే చెప్పాను... మా ఆటలు, చిన్నప్పటి స్నేహం మొత్తం అంతా.

"మీరాధే, మా కృష్ణమూర్తి" అంది మాణిక్యం.

వాడు ఆశ్చర్యపడి "మీరిద్దరూ ముందే లాలూచీ అన్నమాట, మామణికి నీఅండకూడా దొరికితే ఇక నా సంగతి చెప్పాలి!" అన్నాడు.

మృదువుగా భర్తకేసి చూసింది మాణిక్యం. ఆ చూపులలో ఎంతో లాలిత్యంతో కూడిన మాతృత్వముంది. విశ్వం అదృష్టవంతుడనిపించింది. మాణిక్యం తన చుట్టూవున్న వారిని సుఖపెట్టగలదు.

"ఓ ఫార్సు చెప్పనా రాధా?" అన్నాడు విశ్వం ఉన్నట్టుండి.

"ఏవిటో?"

"మా పెళ్ళయినకొత్తలో నువ్వు కుమ్మక్కై 'గ్రీట్' చేస్తూ 'రాధ' అన్న సంతకం చేసిన ఉత్తరం పూర్తిగా చూపించకుండా సంతకం చూపించేను... అప్పుడు చూసుకో, అమ్మాయిగారి మూతివిరుపు, సత్యభామపోజు ఇలాగే వుండేదనిపించిందనుకో నాకు" అని, "అవునా?" అన్నట్టు భార్యకేసి చూశాడు విశ్వం.

"నాకు తెలుసున్న మాణిక్యం అలా ఎన్నడూ చెయ్యదు" అన్నాను.

మాణిక్యం నిండుగా నవ్వింది.

"నేను మొదటే చెప్పానుగా మీరిద్దరూ లాచీలా అని. సరేలే! ప్రయాణంలో అలిసిపోయుంటావ్. స్నానం చేసిరా, భోజనం చేద్దాం" అన్నాడు విశ్వం.

స్నానం చేసి పంచకట్టుకొని జుట్టు దువ్వుకుంటూంటే విశ్వం స్నానానికి వెళ్ళాడు. తల దువ్వుకుంటూ గోడకున్న మాణిక్యం, రాజేశ్వరీవున్న చిన్న నాటిఫోటో చూస్తూ నించున్నాను. ఫొటోలో కూడా మాణిక్యం నవ్వుతోంది. రాజేశ్వరి కళ్ళు విశాలంగా తెరిచి అమాయకంగా చూస్తోంది.

"ఏవిటీ ఆఫోటో చూసి అంతలా ఆలోచిస్తున్నావ్?" అడిగింది వెనకనించి మాణిక్యం.

"అమాయకంగా చూస్తూ కలలుగంటూన్న 'రాజి' ఈపాటికి పెరిగి ఎంత పెద్దదయి వుంటుందా? అని ఆలోచిస్తున్నాను" అన్నాను చూపు తిప్పకుండానే.

గట్టిగా నిట్టూర్పు వినపడింది. వెనక్కి తిరిగాను. మాణిక్యం పెదవులు వణుకుతున్నట్టు అనిపించింది నాకు. నా ఊహే నేమోననిపించింది.

"మన పెద్దవాళ్ళు 'పెరిగిపోవడం' 'పెద్దదయిపోతోంది' అన్న మాటలు ఒకప్పుడు వింతఅర్థంలో వాడతారు... తెలుసుకదూ?" అంది.

నాకేమనాలో తోచక వూరుకున్నాను.

"మా అమ్మమ్మ అనేది.... దీపం పెద్దదయిపోతోంది - నూనె పొయ్యమని. దీపం ఆరిపోయిందని అనకూడదని అనేదావిడ" అంది మాణిక్యం.

"అవును! దీపం పెద్దదైపోయిందంటే దీపం ఆరిపోయిందన్నమాట."

"అలాగే మా 'రాజి' పసుపు, కుంకుమ కూడ పెరిగి పెద్దవయిపోయాయి. అది ఇప్పుడెంత పెద్దదయితే మాత్రమేం?... దాని జీవితమే ముక్కలయినప్పుడు" అంది మాణిక్యం దూరంగా చూస్తూ.

నాకు నోటమాట రాలేదు. రాజి అమాయకపు హృదయంలోని క్షోభ నేను ఊహించడానికైనా భయపడ్డాను. నాకు కనపడకుండా వుండాలని మాణిక్యం పక్కకి తిరిగి కళ్ళు వత్తుకొంటోంది. మా ఇద్దరి మధ్య నిశ్శబ్దం తెలీని ఆందోళనేదో మా హృదయాలనంతా ఆవరింపజేస్తోంది.

"ఎప్పుడైంది ఇదంతా..." అన్నాను మాట పూర్తిచెయ్యకుండానే అర్థమయ్యేట్టు చెప్తూ.

మాణిక్యం నాకేసి తిరిగింది. కళ్ళు కొద్దిగా ఎర్రబడ్డాయి... కనుకొలకుల్లో నీరు ఇంకా నిలిచివుంది.

"మా రాజి పదహారో ఏట మా అమ్మకి వంటికి నీరు పట్టింది. బతకదేమో అనుకున్నాం అందరం. మా అమ్మ 'రాజి పెళ్ళి చూస్తానో, లేదో' అనేది. వెంటనే నాన్నగారు దానికి పెళ్ళిచేశారు. పెళ్ళయిన మూణ్ణెల్లలో అతను కలరావచ్చి పోయాడు. ఈ సంగతి విని మా అమ్మపోయింది. పెళ్ళినాడు తప్పితే మళ్ళా ఇటూ, అటూ రాకపోకలుకూడా జరగలేదు... ఆ మూణ్ణెల్లలో, ఇదంతా జరిగి ఐదేళ్ళు కావస్తోంది."

"ఇప్పుడు రాజి ఎక్కడుంటోంది?" అన్నాను.

"మొదట్లో నాన్నగారి దగ్గరే వుండేది. దాని స్థితిచూసి నాన్నగారు బెంగలో మరీ అలమటించిపోయేవారు. దాంతో దాన్ని నేనే ఇక్కడికి తీసుకొచ్చేశాను. ఇక్కడే చదువుకుంటోంది. ఇంటరు పాసై బి. ఏ. మొదటి సంవత్సరం అయింది. సెలవల్లో ఇంటికెళ్ళిందిలే... నాన్న చూస్తానంటే. ఇవాళో, రేపో రావాలి... వస్తానని ఉత్తరం రాసింది" అని ఇక మాట్లాడలేక వూరుకొంది మాణిక్యం. ఓ నిముషం ఆగి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

మాణిక్యం చెల్లెలుగురించి పడుతున్న బాధ ఆమె దాచుదామన్నా దాగలేదు. ఆ

కోరింత దగ్గు అనే కక్కాయదగ్గుకు

స్టాన్సు వారి కోంగ మార్కు మందు ప్రాణదానమిచ్చును చంటి పిల్లలకు తరచు సంభవించు కోరింత దగ్గుకు నిరపాయమైన మందు. 3 అమావాశ్యలు పోవలయునని యేమారవద్దు 8 రోజులలో తప్పక గుణము నిచ్చును. ఆంధ్రదేశములో అన్ని మందుషాపులలో దొరకును.

జి.యస్.స్టియర్స్ & కో., మద్రాసు-1

★ జీవనరాగం ★

మాటలు చెప్తుంటే ఆమె కంఠంలో గాద్గద్యంవన్నె కలవరపరిచింది. మాణిక్యానికి చెల్లెలిమీద చెప్పలేనంత అపేక్ష... కానీ ఎప్పుడూ పైకిచెప్పేదికాదు. ఇప్పుడూ అలాగే మాట్లాడింది.

"రావోయ్... భోంచేద్దాం" అన్నాడు విశ్వం తువాలు బుజంమీద వేసుకుంటూ.

భోజనం దగ్గిర కూచున్నానన్న మాటే గాని నాదృష్టి అక్కడలేదు.

"ఇక్కడ మొహమాట పడుతున్నా వేమిటోయ్! అలా ఆలోచిస్తూ నించున్నా వేమిటి మణీ, కొంచెం బలవంతంచెయ్యి" అన్నాడు విశ్వం.

"నాదగ్గర డబ్బలాడి జామికాయలు లాక్కుని తినేవాడు... అతనికి నా దగ్గర మొహమాట మేవిటి?" అంటూ మాణిక్యం కూర పచ్చడి నావిస్తట్లో వేసింది.

నాఆలోచన వాళ్ళకి తెలీనుండకుండు గాను ఏదో మాట్లాడాలని ప్రయత్నం చేశాను. కాని మాణిక్యం నా 'మూడ్' కని పెటిందేమోనని నాకనుమానం వేసింది.

భోజనంచేసి వక్కపొడి నములుతూ సిగరెట్టు కాలుస్తూ, మాకోసం డాబాలో వేసిన పక్కలమీద కూచుని మాట్లాడు కుంటున్నాం. విశ్వం పాతవి, కొత్తవిఎన్నో సంగతులు చెపుతున్నాడు. వెన్నెల మందంగావుంది. చల్లగా గాలి అప్పుడప్పుడు తగుల్తూ మిత్రుడి స్పర్శలా ఆనందింప జేస్తోంది.

"మీ మరదలు 'రాజి' సంగతి ఘోరం కదూ?" అన్నాను సడెన్‌గా.

"ఆ మరే! అంతా ఖర్మనుకో మన చేతుల్లో ఏం వుందిరా? ఏది ఎలాజరగాలో అలా జరుగుతుంది..."

వాడి వేదాంతం నాకు చిరాకనిపించింది. ఇరవై ఎనిమిదేళ్ళ విశ్వం ఇలాంటి విషయా లలో వేదాంతం మాట్లాడుతున్నాడంటే మనతరంలోనే ఏదో నిస్త్రాణ, స్తబ్ధత ఆవ రించాయనిపించింది.

శతమూలికాదిలేహ్యము

5 భస్మములు 100 మూలికలు చేరినవి. సెగ సవాయి మున్నగు సుఖవ్యాధులు, మేహ కొడ, మచ్చలు, పుండ్లు మాన్పి రక్తం శుద్ధిపరచి బలము నరముల పటుత్వం కల్గించును. స్త్రీల బహిష్టుబాధలు అమిత నొప్పి నష్టసంతానము నివారించి సంతానం కల్గించును. కేటలాగు, సలహా ఉచితము.

శ్రీ భుజంగరావు వైద్యశాల

తాళ్ళరేవు - తూర్పుగోదావరి.

విశ్వం పెద్దకొడుకు చేత వాడికొచ్చిన విద్యలు నాముందు ప్రదర్శింప జేస్తున్నాడు. వాడికప్పుడే పదమూడో ఎక్కం కూణ్ణంగా వచ్చునట.

"ఏదీ, అప్పజెప్పరా" అన్నాడు.

నక్షత్రాలు చూస్తూ తనలో నవ్వు కుంటూన్న ఆపిల్లాణ్ణి ఇలాటప్పుడు ఎక్కా లడగడం నాకు భావ్య మనిపించలేదు.

"ఇప్పుడెందుకులే, రేపు చెపుదువు గానిలే. నక్షత్రాలు బావున్నాయికదూ?" అన్నాను.

"ఎన్నో! అన్నీ అలా ఎప్పుడూ అక్కడే వుంటాయా?" అన్నాడు పిల్లాడు మొహ మంతా ఆశ్చర్యంతో.

ఇంతలో మాణిక్యం పైకొచ్చింది. చంద మామ మబ్బుల్లోనుచ్చ కదుల్తున్నాడు. రెండో పిల్లాణ్ణి వళ్ళో పడుకోబెట్టుకుని "చంద మామ రావే, జాబిల్లి రావే" అని పాడు తోంది మాణిక్యం. "జాబిల్లి అంటే ఏమి టమ్మా?" అనడుగుతున్నాడు పెద్దపిలాడు.

సిగరెట్టుపెట్టె తీసి ఆలోచిస్తున్నాను.

"కాల్చవోయ్. అభ్యంతరం లేదులే" అంది మాణిక్యం.

విశ్వం ఆఫర్ చేసినా తీసుకోలేదు. "మనం రోజుకి పది కాల్చాలని మా మణి ఆర్డర్ గా! సిగరెట్లదగ్గిరించీ నన్నెంత మార్చేసిందనోయ్ మీ మణి."

నాకు నవ్వొచ్చింది.

"నవ్వుతా వేం?" అన్నాడు.

"ఇందాక నే మాణిక్యాన్ని 'మా విశ్వం ఇంకా అలాగే వున్నాడా, నువ్వేమైనా మార్చావా?' అంటే, 'మగవాళ్ళు అంత సుల భంగా మారతారుటోయ్' అంది. నువ్వేమో 'ఎంత మార్చేసింది' అని ముక్కుమీద వేలే సుకుంటున్నావ్-అందుకని నవ్వొచ్చింది."

"నీకు తెలీదు కాని రాధా... ఆడవాళ్ళు వాళ్ళకి తెలీకుండానే ఎంత మార్చేస్తారనీ— అది మన మంచికే అనుకో. వాళ్ళ ప్రభావం మనమీద ఎప్పుడూ పనిచేస్తుందనుకో. అది మన వంటికి మంచిదే సుమీ... లాంగ్ రన్‌లో. నే నందుకే చెప్తున్నాను - నువ్వు కూడా నిమ్మకి నీరోసినట్టు వుంటావ్... ఆ పెళ్ళి కాస్త అయిందనిపించుకో. మా మర దలుపిల్ల సావాసంతో నువ్వు ఎంత మారి పోతావో చూడు. అదికాదు బ్రదర్, పెళ్ళికి నీ అభ్యంతరం ఏవిటోయ్?"

"పెళ్ళికి నా అభ్యంతరం ఏం లేదులే. నేను చేసుకోనని ప్రతిజ్ఞ తీసుకోలేదుగదా"

"వాదన బాగానే వుంది కాని కృష్ణ మూర్తీ... మీ అమ్మగారూ పెద్దవారయి పోయారు; నువ్వా యింటి కంతికీ ఒక్కడివి ...ఆవిడ కోడలు రావాలనుకోడం భావ్య మేకదా! నీకా చదువుకు చదువూ, ఆస్తికి ఆస్తీ వుంది. నీకు నచ్చిన పిల్లనే చూసుకో వోయ్" అంది మాణిక్యం.

నేను నవ్వుతూ పూరుకున్నాను ఏమన కుండాను. నాకు ఆవిషయంమీద మాట్లాడా లని లేదని వాళ్ళిద్దరూ గ్రహించినట్టున్నారు ...టాపిక్ మార్చి మాట్లాడుతున్నాడు విశ్వం. మాట్లాడుతూనే విశ్వం నిద్రపోయాడు. నాకూ మగతగా వుంది. మాణిక్యం పక్క గదిలోకి వెళ్ళిపోయింది పిల్లాణ్ణి తీసుకొని.

పొద్దుట లేచేటప్పటికి తెలతెలవారు తోంది. దూరంగా పక్షు లరుస్తున్నాయి. కాఫీ తాగి, పదింటికి భోంచేసి పడుకొన్న నిద్ర లేచేటప్పటికి నాలుగవుతోంది.

"అలా క్లబ్బుకి వెళ్లొద్దాం, రావోయ్" అన్నాడు విశ్వం.

ఇద్దరం బయల్దేరి క్లబ్బు కెళ్లాం సాయంత్రం. అక్కడ విశ్వం నలుగు రైదుగురు కొత్తవాళ్ని పరిచయం చేశాడు. అంతా కాలేజీలో లెక్చరర్సు. నాతో అందరూ తలోమాట మాట్లాడి వాళ్ళ గొడవల్లోకి దిగి పోయారు. ఒకాయన సుశీలనే అమ్మాయి మీద లేగిన 'స్కాండల్' గురించి కొత్త సంగతు లేవో చెప్తున్నాడు. మరొకాయన "ఆ కొట్లో నెయ్యెంత చవకో?" అంటు న్నాడు పక్కాయనతో. విశ్వం పేకాటలో దిగాడు. నాకు అక్కడ ఏం తోచలేదు. నేనేమిటో అక్కడ చాల ఇరుగ్గా ఫీలయ్యాను.

విశ్వం దగ్గరకెళ్లి "అలా తిరిగొస్తారా" అన్నాను.

వాడా పేకముక్కలు చూసుకుంటూ "ఏవిటీ! వెళ్తావా? సరే" అని "రాధా దస్సొచ్చేయ్ సుమీ" అని కేక వేశాడు.

రోడ్డుమీది కొచ్చాను. జనం ప్రవా హంలా కదిలిపోతున్నారు. నీలి చొక్కా వేసుకున్న రైల్వే ఎంప్లాయీ రెండు జడ లతో పోతూన్న పిల్లని పోతూ పోతూ చూస్తు న్నాడు... చూస్తూ చూస్తూ పోతున్నాడు. ఆకుపచ్చ చీర కట్టుకున్న పచ్చటి పెళ్లాన్ని తాలూకాఫీసు గుమాస్తా నడిపించుకు తీసుకు పోతున్నాడు. 'కొంచెం పైకి జరగండమ్మా' అంటూన్న జట్కాబండివాడివేపు జరుగు తూన్న రెండోపెళ్లి పెళ్లాన్ని చూడలేక, పరిస్థితి కాదనలేక వీధిలోకి మొహ మెట్టు కొని అసూయతో చూస్తున్నాడు ఓ తాత గారు. అరటిపండు తొక్కమీద జారి ఒకా యన పడ్డాడు. నలుగురు నవ్వారు. ఇద్దరు 'పాపం' అన్నారు.

ఎదురుగా సినీమా హాలు కనబడింది. టిక్కెట్టు కొని లోపలికెళ్లాను. హాలంతా మల్లెపూలవాసన. ఒకాయన పేపరు చదువు కుంటున్నాడు హాల్లో. 'Smoking in the

(61-వ పేజీ చూడండి)

★ జీవనరాగం ★

(20-వ పేజీ తరువాయి)

hall is strictly prohibited' అన్న స్లైడు వెయ్యగానే ఐదుగురు సిగరెట్లూ, ఇద్దరు చుట్టలూ వెలిగించారు.

రాజులు, రాణీలూ, కత్తియుద్ధాలు, గుర్రపుస్వారీలూ, విలనూ వున్న హిందీసినిమా కదిలిపోతోంది. డ్యూయెట్లుపాడడం మినహా ఇంకేం చాతగాని ఆ హీరోకంటే ఆ విలన్ నచ్చాడు నాకు. ఆ విలన్‌లో అసూయైనా వుంది...ఈ హీరోలో 'నిన్ను ప్రేమించాను మొర్రో' అని హీరోయిన్‌తో అనడం తప్పితే మరోగుణం ఏంలేదు. గుర్రాలు పరుగెడుతున్నప్పుడల్లా ఈలలు కురిసిపోతున్నాయ్. ప్రియుడు దగ్గరలేకపోయేటప్పటికి తోటలో గంతులేస్తూ, హీరోయిన్ పాడుతోంది మారపైకెత్తి...లతాకంఠంతో. పాటఅయిపోయే సమయానికి విలన్ వెనకనించి కథానాయికకళ్ళు మూశాడు. నాయిక, హీరో అనుకొని మొహం చూడకుండానే ఇటుతిరిగి అతని హృదయంపై తల ఆన్చి చిలకపలుకులు పలుకుతోంది. ఇంతలో హీరోవచ్చి అదిచూసి ముక్కుకోపా లెగరేసూ తిరిగిపోతున్నాడు.

సినిమా నాకు తలనొప్పి ప్రసాదించింది. ఇంటర్వల్‌లో పైకివచ్చేశాను. మెల్లిగా నడుచుకుంటూ ఇంటికెళ్ళాను. హాల్లో విశ్వం రెండోపిల్లాడు నా లాల్చీమీద సిరా బుడ్డిలోంచి సిరాపోసి తాపీగా అలుకుతున్నాడు. నేను చూస్తూనించొన్నాను.

పక్కగదిలోంచి సన్నని కూనిరాగం వినిపిస్తోంది. క్రమంగా స్వరం పెద్దదై ఇల్లంతా అలుముకుంటోంది. ఆ పాటలో సంగీతపు సొంపులేదు...కాని వినేవాళ్ళ హృదయాల్లోకి సూటిగా దూసుకుపోతోంది. ఏదో లోకాల అంచులకు సైతం 'ఎప్పీల్' చేసే లాలిత్యం, వేదన, జాలిమేళవించి నన్ను కదిలించేస్తోంది. మాణిక్యం ఎంతబాగా పాడుతుంది అనిపించింది.

ఇంతలో పుత్రుడు నన్ను చూసినట్టున్నాడు...భయమేసి ఏడుపు మొదలెట్టాడు. గదిలోంచి 'ఏంబాబూ, వస్తున్నా' అని వినిపించింది.

"మీవాడు చేసేపని చూశావా మాణిక్యం?" అంటూ తలఎత్తి ఎదురుగా నించున్న మూర్తీభవించిన సౌందర్యాన్ని చూస్తూ మ్రాన్పడిపోయాను. తెల్లనిచీరలో, సన్ననివంటితో మెరుస్తూన్న ఆమె మాణిక్యంకాదు. నన్నుచూసి ఆమెకూడా నిలబడిపోయింది. ఆమె పెద్దకళ్ళల్లో పాపలు వింతగా, దీనంగా చలిస్తున్నాయ్. ఆమె నుదురు ఎత్తుగావుండి వెలిగిపోతోంది.

"ఆనవాలు పట్టలేదూ రాజీ? ... మన కృష్ణమూర్తి" అంది మాణిక్యం వెనకనించి వచ్చి.

ఆమె కళ్ళలో జ్ఞాపకంవచ్చిందన్నట్టుగా మెరుపు మెరిసింది. సన్నగా, పెదవులు తెరవకుండా నవ్వింది.

"రాజి సాయంత్రం వచ్చిందోయ్" అంది మాణిక్యం.

"మీ నాన్నగారు కులాసాగా వున్నారా?" అన్నాను ఆమెను ఇంకెలా పలకరించాలో తెలీక.

"ఊఁ" అంది రాజి మెల్లిగా.

"విశ్వం రాలేదూ?" అన్నాను మాణిక్యం వేపు తిరిగి.

"వచ్చారు...స్నానం చేస్తున్నారు."

భోజనం దగ్గర కూచున్నంతసేపూ గదిలోంచి సన్నగా, ఏదో లోకాల్లోకి ఎత్తేస్తూ, హృదయాన్ని కదిల్చి జాలిలో నింపే మృదువైన కూనిరాగం వినిపిస్తూనే వుంది. ఆ రాగంలో తీవ్రత లేకపోయినా అంతరాంతరాలలోకి దూసుకుపోయే శక్తి వుంది.

"మా రాజికి తనలో తను పాడుకోడం సరదా" అంది మాణిక్యం వడ్డిస్తూ.

భోజనంచేసి డాబామీదికెళ్ళాం. పని పూర్తిచేసుకొని మాణిక్యం వచ్చింది.

"రాజీ విశేషాలేం చెప్పలేదేం? అంతా కులాసాగా వున్నారా రాజమండ్రీలో" అన్నాడు విశ్వం.

"రాజీ" అని కేకేసింది మాణిక్యం.

రాజి పైకొచ్చింది. చందమామ మీద మబ్బులు తొలిగి వెన్నెల నిండుగా డాబా నిండా పరుచుకొంది. రాజి, మాణిక్యం పక్కన కూచుని ఆకసంకేసి చూస్తోంది. వెన్నెల కాంతి ఆమె నుదుటిని మరింత వెలిగిస్తోంది. కుంకుమలేని ఆమె నుదురు పైకి చూస్తూ ఆకసాన్ని జవాబులేని ప్రశ్న ఏదో అడుగుతూన్నట్టుగా వుంది. తెల్లని చీర, తెల్లని జాకెట్టు ఆ వెన్నెట్లో మరింత కొట్టొచ్చినట్టుగా వున్నాయి.

"మీ నాన్నగారు కులాసాగా వున్నారా?" అన్నాడు విశ్వం.

తలవూపింది రాజి 'అవునన్నట్టు!'

"మర్చిపోయాను! మా చిన్ననాటి స్నేహితుణ్ణి తీసుకొచ్చాను—చూశావా?"

మెత్తగా నవ్వింది రాజేశ్వరి.

"ఇంకా విశేషాలేవిటీ?"

రాజేశ్వరి రాజమండ్రీ విశేషాలు చెప్తోంది. నాకు నిద్ర పట్టేసింది.

పొద్దుట లేచేటప్పటికి బాగా తెల్లారిపోయింది. లేచి మొహం కడుక్కొని, కాఫీ తాగి, అమ్మకి ఉత్తరం రాశాను...ఇలా అనుకోకుండా మాణిక్యాన్ని కలుసుకున్నానని. ఆవాళ మాణిక్యం పాయసం, పులిహోరల్తో మస్తుగా భోజనం పెట్టింది. ఒళ్ళు తెలీని నిద్ర పట్టేసింది. లేచి బిస్కట్లు తిని, కాఫీ తాగి డ్రాయింగు రూములోకెళ్ళాను. అక్కడ విశ్వం కాకుండా మరోకాయన కూడా వున్నాడు. ముప్పై ఏళ్ళు వుండాచ్చు. ఆయన నన్ను చూడగానే 'నమస్కారమండీ' అన్నాడు. ఆయన్ని ఎక్కడో చూసినట్టుంది ... కాని గుర్తురాలేదు. ఆయన కళ్ళు చిట్లించడం చూసిం తర్వాత జ్ఞాపకమొచ్చింది... నిన్న క్లబ్బులో మీట్ అయిన మూర్తి అని. ఆయన నాతో చాల మర్యాదగా మాట్లాడుతున్నాడు.

"మా యింటికోసారి మీరు విశ్వంగారితో రావాలి" అన్నాడు మూర్తి ఓ అరగంట తర్వాత.

"అలాగే" అంటూ లేచాడు విశ్వం.

ఓ పెద్ద మేడలోకి తీసికెళ్ళాడు మూర్తి. మమ్మల్ని గదిలోకూచోపెట్టి తొందరగా లోపలికెళ్ళి వాళ్ళ నాన్నగారిని తీసికొచ్చి పరిచయం చేశాడు. ఆ పెద్దాయన నన్ను 'తమరేంచేస్తున్నారు?' అన్న ప్రశ్నతో మొదలెట్టి అవీ, ఇవీ అడుగుతున్నాడు. అంత పెద్దాయన నన్ను 'తమరు' అని సంబోధించడం నాకేమిటోలా అనిపించింది.

మూర్తి రేడియో ట్యూన్ చేస్తున్నాడు.

"మొన్ననే రేడియో మార్చేస్తానన్నావ్? ఇది కొత్తదా?" అన్నాడాయన కొడుకుతో.

"మరే, ఈ సెట్టు మొన్ననే తెప్పించానండీ ... ఏడువందల పైచిలుకు" అన్నాడు మూర్తి విశ్వంకేసి చూస్తూ.

"మావాడు పాతవన్నీ తీసేసి కొత్తవి కావాలంటాడండీ. అలా అనే ఐదేళ్ళబట్టీ వున్నకారు అమ్మేశాడు. కొత్తది బేరం చేస్తున్నానన్నావ్, ఏమైందిరా?" అంటున్నాడు పెద్దాయన.

కాసేపుండి "కాస్త కాఫీ తీసుకుందురుగాని లోపలికి రండి" అని నాకేసి చూస్తూ ఆహ్వానించాడు.

నాకు తాగాలని లేదు. కాని 'కాదంటే' బావుండదని లోపలికెళ్ళాను.

టేబిల్ మీద సరంజాం చూసి ఆశ్చర్యపోయాను...ఏదో పెదపార్టీ ఇస్తున్నట్టుగా ఎరేంజ్ చేశారు. నేను కాఫీమాత్రం తాగాను ... కాఫీ బావుంది. నన్ను కాస్త ఏమైనా తినమని వాళ్ళు పెద్ద బలవంతం. నాకు చిరాకేసి "నాకు కావలిస్తే తీసుకుంటా లెండి" అనేదాకా వాళ్ళు ఆ మర్యాద ఆపలేదు.

మళ్ళా డ్రాయింగు రూంలోకొచ్చి కూచున్నాం. పెద్దాయన ఆ ఫలాన సోఫా

★ జీవనరాగం ★

నెట్టు ఎప్పుడు నేర్పించాడో చెపుతున్నాడు విశ్వంతో. తనుకున్న ఐశ్వర్యాన్ని అలా చెప్పుకోడం ఆయనకు సరదాయేమో ననిపించింది.

ఇంతలో ఆయన "రామ్మా, సిగ్గెందుకు ...అంతా మనవాళ్ళే" అంటూ ఓపిల్లని లోపలికి ఆహ్వానించాడు; 'మా అమ్మాయి, కాలేజీలో చదువుతోం"దని పరిచయం చేశాడు. ఆ పిల్ల బొద్దుగా, పచ్చగావుంది.

నేను నమస్కారం చేశాను.

ఆ అమ్మాయి కుర్చీలో కూచుంటూ సిగ్గుపడింది. కళ్ళు తిప్పుతూ, తల కొద్దిగా వంచి కూర్చుంది.

ఏం మాట్లాడకపోతే బావుండదని "ఏం చదువుతున్నారు?" అన్నాను ఆ అమ్మాయి నుద్దేశించి.

ఆ పిల్ల తండ్రి కేసి చూసి "ఇంటరు సీనియర్" అంది.

"మా అమ్మాయికి వీణ చెప్పించుదామని వుందండీ. గాత్రంకూడ బావుంటుంది లెండి. ఏదీ! ఓ పాట పాడమ్మా. మీకు శాస్త్రీయం ఇష్టమా?...లేక సినిమాసంగీతం కావాలంటే అదే పాడుతుంది" అన్నాడాయన నాకేసి చూస్తూ.

నా చిరాకు చివరిదశకు వచ్చేసింది. ఆ పిల్ల అంత సిగ్గుపడుతూంటే ఈయన పాట పాడమంటాడేమిటీ! పోనీ అన్నా, నా ఇష్టమేమిటీ?...మధ్య నే నేదో తీర్పు చెప్పే వాడిలా! అసలు నా కక్కడనించి పోవా లనిపించింది. కాని సభ్యత పాటించి "నాకు సినిమా ప్రత్యేకమైన ఇష్టంలేదు" అన్నాను నా అనిష్టాన్ని ధ్వనింపచేస్తూ.

ఆ అమ్మాయి ఏదో పాడుతోంది. నేను టేబిల్ మీదున్న పేపరు చదువుతూ కూచున్నాను. కాసేపట్లో ఆ పిల్ల లోపలికి వెళ్ళిపోయింది. విశ్వం, మూర్తి ఏదో పనుండి పక్కగదిలోకి వెళ్ళారు.

పెద్దాయన కాసేపు పిచ్చాపాటీ మాట్లాడి "మీ గోత్రమేమిటి బాబూ" అన్నాడు.

ఇందాకటినించీ జరుగుతూన్న తతంగానికంతటికీ అర్థం ఇప్పుడు నాకు పూర్తిగా స్ఫురించింది. నాకు చిరాకు పుట్టింది.

"మా విశ్వం అన్నీ చెపుతాడులెండి," అని వినయంగా విశ్వందగర వెళ్ళి "విశ్వం! నువ్వు వస్తావా ఇప్పుడు? నాకు పనుంది... వస్తే, రా" అన్నాను.

"నేనూ వచ్చేస్తున్నా" అని విశ్వం వచ్చేశాడు.

"తమర్ని తర్వాత కలుసుకుంటా"నని పెద్దాయన విశ్వంతో ఏదో చెప్తున్నా వినిపించుకోకుండా వీధిలోకి వచ్చేశాను. పక్కన విశ్వం నడుస్తున్నాడు. రెండు నిము...బు ఎవ్వరం మాట్లాడలేదు. నాకు విశ్వం ...ంచుకోలేనంత కోపంగా వుంది.

"నీ వుద్దేశ మేమిట్రా?" అన్నాను కోపంగా.

"ప్రస్తుతం క్లబ్బుకెళ్ళి, వస్తే పిక్చరుకెళ్దామని, నీ వుద్దేశ మేమిటి" అన్నాడు విశ్వం.

"ఇదిగో, నువ్వు అతి తెలివిగా మాట్లాడకు నాతో చెప్పా, పెట్టకుండానే నాకీ పెళ్ళిచూపులు సిద్ధం చెయ్యడంలో నీ వుద్దేశ మేమిటీ అని అడుగుతున్నాను."

"అదా! నాకు మాత్రమేం తెలుసురా. రమ్మంటే నీలాగే నేనూ వెళ్ళాను."

వాడిమాటమీద నాకు నమ్మకం లేకపోయింది. ఇంకేమైనా అంటే తొందరపడతానేమోనని, "నేనలా వెళ్ళొస్తాలే. రాత్రి వచ్చేటప్పటికి కొంచెం ఆలస్యమవుతుంది... నాకోసం ఎవ్వరూ వెయిట్ చెయ్యద్దు—భోంచేసెయ్యండి" అన్నాను ముందుకడుగేస్తూ.

వాడు తెల్లబోయాడు. పరిస్థితి చెయ్యి దాటిపోయిందని గ్రహించినట్టున్నాడు: "తొందరగా వచ్చేయ్ సుమీ" అని మాత్రం అన్నాడు.

నేను ఒక్కణ్ణీ కృష్ణవడ్డుకి పోయాను. తిరిగి వచ్చేటప్పటికి పది దాటుతోంది. మాణిక్యం తలుపుతీసింది. ఏం మాట్లాడకుండా డాబామీదికి పోయాను. రాజేశ్వరి ఒక్కతే కూచుని శరత్ 'శేష ప్రశ్న' చదువుకుంటోంది. నన్ను చూసి పుస్తకం మూసింది.

ఇంతలో మాణిక్యం, వెనకాల విశ్వం వచ్చారు.

"భోంచేద్దువుగాని లేవోయ్" అంది మాణిక్యం.

"నేను మిమ్మల్ని తినెయ్యమని చెప్పానే విశ్వంతో......నేనిప్పుడేం తినను."

"కొద్దిగానే తినవోయ్ ... నీకు తోచినంతే."

"నాకేం అక్కరలేదు మాణిక్యం! అసలు మా వాడి చేసిన పనితో పూర్తిగా కడుపు నిండిపోయిందిలే"

"నువ్వుకొద్దిగా మజ్జిగా అన్నం తిను... ఆ భోర్న తగ్గుతుంది" అని మెల్లి అంటున్నాడు విశ్వం.

"ఏం చేశావేమిటి?" అంది మాణిక్యం

"నీతో ఏం చెప్పలేదా విశ్వం?"

"ఏదో కొద్దిగా చెప్పాడ్లే..."

"నువ్వే చెప్పు మాణిక్యం! ఏ వేదో రమ్మంటే బాగుండదని పోయానా...ఆయన పక్కన వాళ్ళ రేడియో, కొనబోతూన్న కారు గురించి ప్రస్తావించి పెద్దపార్టీలా చేసి, పిల్లని చూపించి, 'మీ గోత్రమేమిటి?' అంటాడా కాసేపు పోయాక? నా కలాటివి ఇష్టంలేదని విశ్వానికి తెలుసుగదా...వీడైనా పోనీ ముందుగా నాకు చెప్పాడా?"

"పూర్తిగా ఈయనకూ తెలీదుటోయ్. మూర్తిగారు మాత్రం ఉండేలుందని చెప్పారుట. కాని పిల్లనిలా చూపెట్టేస్తారని ఈయనా అనుకోలేదట," అంది మాణిక్యం.

"నిజమేనా?" అన్నట్టు విశ్వం కేసి చూశాను.

"నువ్వా సంగతి నన్ను చెప్పనిస్తేనా?... కోడుమీద నీ ధూకుడు చూసి జనం కూడ దంగైపోతూంటే నే నేమనను?" అన్నాడు విశ్వం. నాకు విశ్వంమీద కోపం మెల్లిమెల్లిగా దిగజారిపోయింది.

"అయినా కాని రాధా...నీకు ముందుగా వాళ్లు చెప్పలేదే అనుకో. పోనీ, కాసేపు అందమైన పిల్లని చూడానికేంరా? దాంతో పెళ్ళయిపోలేదు గదా? ఆ అమ్మాయేమో అప్పుడే పెళ్ళయినట్టు ఏకసిగ్గూ, నువ్వేమో నీకేం సంబంధంలేనట్టు పేపరులో తలదూర్చి కూర్చున్నావ్," అన్నాడు విశ్వం, మామూలుధోరణిలో పడుతూ.

"అదికాదురా విశ్వం! మనం పెళ్ళికం 'నోవల్ కాలా' వుండాలి? నాకు బజారుపద్ధతిలో పిల్లని చూపించడమా?... ఎందుకీ ముసుగులో గుద్దులాట? అక్కడికి ఆ పిల్ల రావడం ఏదో యదాలాపం అన్నట్టు పైకి కనిపించాలా? పైగా అంతసిగ్గేమిటోయ్ ఆ పిల్లకి...చదువుకుంటోంది కూడాను."

"అదేనోయ్ చెప్పేది. వాళ్ళాసంబంధం సెటిలయిం దనుకుంటున్నారు ... కట్నం మాంఛి బరువుగా ఇస్తారుగాబట్టి. ఇదిగో రాధా, ఆ లాంఛనా లేవిటో ఇస్తామని మూర్తి చెప్పేదుగాని. కానన్ను తోడు పెళ్ళికొడుకులా రెకమండు చేద్దూ. సందులో సందు నాకూడా ఏదయినా దక్కుతుంది" అన్నాడు విశ్వం నవ్వుతూ.

నాకూ నవ్వొచ్చింది. రాజేశ్వరి పక్కకి తిరిగి నవ్వుకొంటోంది.

విశ్వం మళ్ళా మొదలెట్టాడు "ఇదిగో అబ్బాయ్, నే చెప్తున్నది విను...పిల్లా రంభలా వుంటుంది...అలా చూడకురోయ్, ఆమాట నే నన్నది కాదుసుమీ—ఆ మునిలాయన వాళ్లమ్మాయిగురించి చెప్తూ అన్నాడు. రంభ ఎలావుంటుందో మనం చూడకపోవడంచేత, ఇలా ఉండివుంటుందని ఆయ నన్నమాట నీకు సరఫరా చేశానంతే. మన సాంప్రదాయం ప్రకారం పిల్లని చూపించారు. నువ్వేదో కాస్తచప్పున 'ఊ' అంటే, నీతో పాటు, పిల్లలుగలవాణ్ణి నేను కూడ నాలుగురాళ్ళు వెనకేసుకోడానికి వీలవుతుంది. ఏమంటావ్?" నేనా సంబంధానికి వప్పుకోనని తెలిసింతర్వాత యిలా వేళాకోళంలోకి దిగాడు విశ్వం.

"మన సాంప్రదాయం ప్రకారం పిల్లని తివాసీమీద కూచోబెట్టి, మాటాడుగా సిగ్గుపడనిచ్చి, అవసరమైన పాట పాడించడం జరిగితే, నాకింత వెగటు కలగకపోను. సాంప్రదాయాన్ని బజారుతో ముడెట్టి, మనల్ని అన్నిపక్కలనించీ ఉచ్చులో బిగించాలని వాళ్ళుచూపిన శ్రద్ధే నాకువిముఖత్వం

జీవనరాగం

కలిగించింది" అన్నాను.

"పిల్ల బాగానే వుంటుందటగాదోయ్! పేరు రాణి, మీ కాలేజీలోనే చదువుతోంది గదూ, నీకు తెలియదూ!" అంది మాణిక్యం.

"ఆ అమ్మాయికేం!...చాలా తెలివైంది, మంచిదీ కూడాను. చురుగ్గా, చక్కగా వుంటుంది," అంది రాజేశ్వరి.

"అయితే ఇంకేం. మీ అమ్మగారికి ఇక్కడ మీ అబ్బాయికి సంబంధం కుదిరిందని రాసేస్తానోయ్" అని మాణిక్యం వేళాకోళం పట్టించింది.

ఇలాగ కులాసాగా ఓ అరగంటకాలం గడిచిపోయింది.

"ఇంక భోజనానికి లేవోయ్" అంది మాణిక్యం.

"ఇన్ని మాట్లు చెప్పాలా మాణిక్యం! నాకు తినాలనిలేదు. నిజం."

మాణిక్యం కిందకెళ్ళి పెద్ద వెండిగ్లాసుతో మజ్జిగ తీసికొచ్చింది, ఇదైనా తాగమని.

చల్లగా మజ్జిగతాగి పడుక్కున్నాను. నిద్ర ఎప్పుడుపట్టిందో తెలీదు...లేచేటప్పటికి మనసు ప్రశాంతంగావుంది. ఇలాగే పది, పదిహేనురోజులు కబుర్లతో సినీమాలతో, హాయిగా, సరదాగా గడిచిపోయాయి. ఈలోపున నేనోసారి మా మేనమామగారింటికి గుడివాడవెళ్ళి, రెండురోజులుండి తిరిగివచ్చేశాను. నేనొచ్చేటప్పటికి మాణిక్యం తండ్రి సుందరరామయ్యగారు వచ్చారు కోర్టుపనిమీద. ఆయన ఎప్పటిలాగే నాతో ఆప్యాయంగా మాట్లాడారు. కొద్దిరోజుల్లో వచ్చేస్తానని అమ్మకి వుత్తరం రాశాను.

"ఎల్లుండి నే వెళ్తాగా" అన్నాను విశ్వంతో ఓ రోజు.

"ఎక్కడికి? సరే... నువ్వెళ్ళితే మళ్ళీ కంటికి కనిపిస్తావ్? నీకు మునిగిపోయే పనులేవిటోయ్? వెళ్ళొచ్చులే" అని వాడు తేల్చేశాడు.

"వెళ్తాలేరా! అమ్మ ఒక్కతేవుంది."

"పోనీ అవిణ్ణికూడా ఇక్కడికి తీసుకొద్దాంలే. ఏమైనా నువ్వెళ్ళడానికి వీల్లేదు."

వెళ్ళక తీరదని చెప్పాను.

వాడు చాల ఫీలయినట్టు కనిపించాడు: "నీకింకా నామీద కోపం తగ్గినట్టులేదే! ఆ పిల్ల ఇంటికెళ్ళడం తప్పే... చెంపలేసుకుంటున్నాను, సరేనా! నీ ఇష్టప్రకారం నీకు ముందుగా తెలిసిన పిల్లనేచేసుకో. కాని ఇప్పుడుమాత్రం వెళ్ళొద్దు."

"ఛ, ఛ! అదేవిట్రా విశ్వం!...నీమీద నాకు కోపమేవిటి?"

వాణ్ణి నమ్మించి నా ఆదివారం ప్రయాణానికి ఒప్పించేటప్పటికి నాకు అరగంట పట్టింది.

ఆదివారం పొద్దుట బట్టలు సర్దుకుంటున్నాను...సాయంత్రం ప్రయాణానికి.

గదిబయట ఎవరోనడుస్తున్నట్టు అనిపించింది. ఇంతలో మాణిక్యం వచ్చింది గదిలోకి.

"నే నివాళ సాయంత్రం వెళ్తున్నాను మాణిక్యం," అన్నాను.

"అవున్లెగా! ఆయనచెప్పారు నిన్న. కొన్నాళ్ళుండకూడదటోయ్ సరదాగాను?" అంది మాణిక్యం.

"అమ్మ ఒక్కతేవుంది మాణిక్యం.... లేకపోతే వుండడానికేం!"

మాణిక్యం ఏదో చెప్పాలనుకొని మానేసింది. ఏదో ఆలోచిస్తున్నట్టుగావుంది. చివరికి చెప్పడం మొదలెట్టింది "మీ అమ్మగారు నాకు వుత్తరం రాశారు మొన్న......నువ్వు మమ్మల్ని ఇలా కలుసుకున్నావని రాశావుట గదూ! అవిడ ఆప్యాయత ఈ ఉత్తరంలోకూడా నిండుగావుంది" అని ఒక్కక్షణం ఆగి "నువ్వు పెళ్ళిచేసుకోవోయ్ కృష్ణమూర్తీ.... అంతకంటె మీ అమ్మగారికి సంతోషకారణం మరోటుండదు. నేను నీకు చెప్పేటంతటిదాన్ని కాదనుకో! మీ అమ్మగారు ఈ ఉత్తరంలో ఏంబాధగా రాయకపోయినా కోడలికోసం వెయ్యికళ్ళతో చూస్తున్నట్టు ఈ ఉత్తరమంతా ధ్వనించింది," అంది.

నే నాలోచిస్తూ వూరుకున్నాను.

"నేను వూరికే అన్నానోయ్, మరోలా అనుకోకు, మీ అమ్మగారు ఈ ఉత్తరంలో ఏం రాయకపోయినా, నాకా ఉత్తరంచూసిన తర్వాత ఈ మాటలు చెప్పాలనిపించిచెప్పాను. అవిడ లెటర్ లో నీ పెళ్ళిగురించి డైరెక్టుగా ఏం రాయలేదనుకో! అవిణ్ణి సంతోషపెట్టడం పిల్లలమైన మన బాధ్యతగదూ? నిజం చెప్పొద్దూ.... నువ్వు ఓపిల్లతో కాపరం చేస్తూంటే నాకూ చూడాలని వుందోయ్," అంది మాణిక్యం నవ్వుతూ.

"ఆ సంగతి మా అమ్మకి చెప్పడానికే మా వూరు వెళ్తూంట" అన్నాను మాణిక్యం కేసి చూస్తూ.

"ఏవిటీ! నిజమే? భలేవాడివోయ్...నా దగ్గరకూడా అంతగుట్టేకి? ఏవూరు సంబంధమేవిటి? మొన్న గుడివాడవెళ్ళింది ఇందుకేనన్నమాట నాకు తెలీకూడదా ఏవిటీ?" అంది ముఖమంతా చిరునవ్వులు చిమ్ముతూ మాణిక్యం.

నాకు ఏం చెప్పాలో తెలీక ఏమనలేదు.

"నాదగ్గరకూడ సిగ్గేమిటోయ్ పెళ్ళికొడుకా" అంది మాణిక్యం.

'నీదగ్గర నాకు సిగ్గుకాదు మాణిక్యం! మనంటే నాకెంతో గౌరవం' అన్నమాటలు నేనెలా చెప్పను మాణిక్యంతో?

దూరంగా ఎక్కడనుంచో రాజేశ్వరి పాడుతుంటోంది. ఆ పాటలో అదే దీనత్వం ...అదే జాలిగొలిపే పిలుపు.

మాణిక్యం కళ్ళల్లోకి నిండుగా చూస్తూ చెప్పేశాను: "రాణిని ఈ నాటినుంచీ కుంకుమ అలంకరించుకోమని చెప్ప... నాటివరకూ ఎవ్వరినీ అజ్ఞాపించలే... నాడు రాణిని అజ్ఞాపిస్తున్నాను— ...యంలో అనుమానాలు, ఆచారాలు ... మని. రాణి ఇష్టం కూడ కనుక్కో."

మాణిక్యం వదనం ఆశ్చర్యంతో ... క్రమంగా చెప్పలేని కృతజ్ఞతా... తోనూ, సంతోషంతోనూ నిండిపో... ఆమె ఆ సంతోషాన్ని మాటల్లో వ్యక్త... లేకపోతోంది. ఆ ఆనందంలో ఆమె ... ముంతా ప్రకాశించి కళ్ళలో నీరునిలి...

"కనుక్కో మాణిక్యం, నా మా... చెప్పి కనుక్కో."

మాణిక్యం లేచింది. రాజేశ్వరి గ... వెళ్ళింది.

నాకు మనసులో ఏ ఆలోచనా లే... ప్రశాంతంగా వుంది. నిముషాలు గ... పోతున్నాయి. అరగంట పైన దాటి... బట్టలు సర్దడం అయిపోవస్తోంది.

గది గుమ్మం దగ్గర గాజులు ధ్వనించా... వెనక్కి తిరిగాను.

నాకు మొదటగా కనపడింది అవన... ...యిన రాణి నుదుట జాజ్వల్యంగా ప్రకా...స్తున్న కుంకుమ. పచ్చని ఆమె నొసలు కుం...కుమ పొందుతో ఎనలేని సౌందర్యంతో వెలిగిపోతోంది. నా ఆశయం సఫలమైంది... ఇన్నాళ్ళ నా కోరిక ఫలించింది... పె... పెద్దదైపోయిన నా రాణి పసుపు, కుంకుమ తిరిగి లభించాయి. పసుపచ్చని చీర ఆమె శరీరపు రంగుముందు సిగ్గుపడుతోంది.

"రాణీ..." ఆమె దగ్గరగా వెళ్ళాను.

ఆమె వదనాన్ని కాంతివంతం చేస్తున్న ఆ కుంకుమ ఎందుకో నాకే సరిదిద్దాలనిపించింది. చేతులు ఆమె వదనాన్ని సమీపించాయి.

ఒకేఒక చూపుచూసింది రాజేశ్వరి. ఆ చూపు నేను నిర్వచించలేను. ఆ చూపులో నిండిన కృతజ్ఞత, ఆశ, ఆనందం నన్ను కదిల్చివేశాయి.

నా చేతుల్లోంచి ముఖాన్ని అతి సున్నితంగా, సహజంగా, దూరంగా తీసికొని చేతులో మొహం దాచుకొని, హంసలా తేలిపోతూ రాణి ఆ గదిలోంచి పారిపోయింది. ఆమె చేతుల్లో మొహం దాచుకుంటూంటే ఆ గాజులు గలగల మన్నాయి ...జీవితానికి అర్థం పలుకుతూన్నట్లు.

రాజేశ్వరి కంఠం ఆమెగదిలోంచి వినిపిస్తోంది. ఆమెరాగం ఈసారి నిండైన శ్రుతిలో పలుకుతోంది. దానిలో మునుపటి అపశ్రుతి, వేదన, దీనత్వం లేవు. గలగల ప్రవహిస్తూ సంతోషంతో గంతులేస్తూ, పరిగెడుతూన్న నదీజలాల కెరటాలా, ఆకసపు టంచులకు ఎగిరే ఉద్వేగంతో, నిండైన శ్రుతితో ధ్వనిస్తోంది.

Printer and Publisher for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at
The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu P